కూలి అడిగినందుకు బెదిరింపులా?

- కాటన్ చీరల యజమానులపై చర్యలు తీసుకోవాలి
- పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూశం రమేష్
- చేనేత జౌళిశాఖ ఏడీ సాగర్‌కు ఫిర్యాదు

కలెక్టరేట్ వద్ద మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు మూశం రమేష్

కలెక్టరేట్, ఫిబ్రవరి 7 : కూలి చెల్లించమని అడిగినందుకు పని కల్పించకుండా కార్మికులు, ఆసాములను చేనేత కాటన్ చీరల యజమానులు బెదిరింపులకు పాల్పడుతున్నారని పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మూశం రమేష్ ఆరోపించారు. కాటన్ చీరల యజమానులపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లోని చేనేత జౌళిశాఖ కార్యాలయంలో చేనేత జౌళిశాఖ ఏడీ సాగర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం కలెక్టరేట్ వద్ద మాట్లాడారు. చేనేత కార్మికులు, ఆసాముల కూలి అగ్రిమెంట్ గతేడాది మే నాటికి ముగిసిపోయిందన్నారు. అప్పటి నుంచి కూలి పెంచకపోవడంతో ఈ నెల 4న యజమానులకు కార్మికులు, ఆసాములు వినతిపత్రం అందజేశారని తెలిపారు. దీంతో కార్మికులు, ఆసాములను యజమానులు పిలిపించుకొని ఆగ్రహం వ్యక్తం చేసి, ఇష్టారీతిన మాట్లాడారని వాపోయారు. అదే రోజు నుంచి పరిశ్రమను బంద్ చేశారన్నారు. భవిష్యత్‌లో కూలి అడగమని.. అధికారులను కలువమని, యూనియన్ వద్దకు వెళ్లమని రాతపూర్వంగా రాసి ఇస్తేనే పని ఇస్తామని యజమాన్యం కార్మికులను బెదిరించడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. కాటన్ చీరల యజమాన్యంపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్ని రోజులు పరిశ్రమను బంద్ పెడితే అన్ని రోజుల వేతనం కార్మికులకు అందించే విధంగా చూడాలన్నారు. లేకపోతే పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఇక్కడ అధ్యక్షుడు వడ్నాల వీరేశం, నాయకులు ప్రతాప్, సూర్యనారాయణ, వేణు, భాస్కర్ ఉన్నారు.

నులి పురుగుల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- జిల్లా స్థాయి ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం

మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

ముస్తాబాద్, ఫిబ్రవరి 7: నులి పురుగుల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ హాల్‌లో నులి పురుగుల నిర్మూలన కార్యక్రమ నిర్వాహణపై అధికారులతో సమావేశమై మాట్లాడారు. సిబ్బందికి అవగాహన కల్పించారు. 1 నుంచి 19 ఏండ్లలోపు పిల్లలందరికీ, వివిధ అన్ని విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు ఫిబ్రవరి 10న ఆల్బెండ జోల్ మాత్రలు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భీరయ్య, తహసీల్దార్ సురేశ్‌కుమార్, గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

డైరీ, టెక్స్‌టైల్ రంగాల్లో ఎగుమతులకు కృషి చేయాలి

కలెక్టరేట్, ఫిబ్రవరి 7: డైరీ, టెక్స్ టైల్ రంగాల్లో ఎగుమతుల కోసం చిత్తశుద్ధితో కృషి చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సూచించారు. కలెక్టరేట్‌లోని మినీ సమావేశ హాల్‌లో సంబంధిత అధికారులతో జిల్లా స్థాయి ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డిస్ట్రిక్ లెవెల్ ఎక్స్పోర్ట్ ప్రమోషన్ కమిటీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సిరిసిల్ల జిల్లా నుంచి ఎగుమతి చేసేందుకు వీలుగా అవకాశం ఉన్న 2, 3 ఉత్పత్తులపై వాటిని ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. నాబార్డ్, ఎంఎస్ఎంఈలు, జాతీయ డైయిరీ డెవలప్‌మెంట్ బోర్డుతో సమన్వయం చేసుకుంటూ పాల ఉత్పత్తులు, సిరిసిల్ల బ్రాండ్‌తో వస్త్రాలు తయారు చేసే ప్రణాళిక తయారు చేయాలన్నారు. జిల్లాలో యాక్టివ్‌గా ఉన్న ఎఫ్‌పీవోలకు ఎక్కువ మార్కెటింగ్ అందేలా చూడాలన్నారు. టెక్స్‌టైల్ రంగంలో ప్రపంచంలో ఎక్కడ ఎంత మేర డిమాండ్ ఉంది, ఎటువంటి వస్త్ర ఉత్పత్తులు ఎగుమతి చేయవచ్చు వంటి వివరాలను పరిశీలించాలని, చేనేత కార్మికులతో రెగ్యులర్‌గా సమావేశాలు, ట్రైనింగ్‌లు నిర్వహిస్తూ అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో కేవీఎస్ శైలజ, పర్సనల్ ప్రైవేట్ సెక్రటరీ, అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్స్, కామర్స్ అండ్ ఇండస్ట్రీ మంత్రిత్వ శాఖ, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వీ రవీందర్ రెడ్డి, జౌళి శాఖ ఏడీ సాగర్, విజయ డైరీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్, లీడ్ బ్యాంకు మేనేజర్ టీఎన్ మల్లికార్జున్, టెక్స్ టైల్ పార్క్ పరిశ్రమల అసోసియేషన్ అధ్యక్షుడు అన్నల్‌దాస్ అనిల్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారులు టీ హనమంతు, ఎంఏ భారతి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేస్తున్న బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు రవి

బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు పంతం రవి

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 7: పార్లమెంట్ సమావేశాలలో బీసీలకు 50 శాతం బిల్లును ప్రవేశపెట్టి అమలు చేయాలని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు పంతం రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో బీసీ హక్కుల సాదన సమితి నాయకులతో కలిసి ఏవోను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, దేశంలో జనగణనతో పాటు కుల గణన జరపాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం బీసీలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నదని విమర్శించారు. ఎన్నికలకు ముందు ప్రజలందరికీ సమాన హక్కులు కల్పిస్తామని ఇచ్చిన హమీని విస్మరించిందని ఆరోపించారు. రాష్ట్రంలో బీసీ జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని, జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలన్నారు. బీసీ అట్రాసిటీ చట్టాన్ని రూపొందించి అమలు చేయాలన్నారు. అన్ని జిల్లా కేంద్రాలలో బీసీ భవనాలను నిర్మించాలన్నారు. అజ్జ వేణు, సోమ నాగరాజు, గాజుల లింగం, కొంక విజయ్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై ప్రజావేదిక

విద్యుత్ సమస్యలు వింటున్న అధికారులు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 7 : మండలకేంద్రంలోని సెస్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం విద్యుత్ సమస్యలపై ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఇల్లంతకుంట, తంగళ్లపల్లి మండల రైతులు తమ సమస్యలపై ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో సీజీఆర్ఎఫ్ చైర్మన్ నారాయణ, టెక్నికల్ సభ్యుడు రామకృష్ణ, ఫైనాన్స్ సభ్యుడు కిషన్, స్వతంత్ర సభ్యుడు రాజా గౌడ్, సెస్ డైరెక్టర్ రవీందర్ రెడ్డి, సెస్ సిబ్బంది పాల్గొన్నారు.

మల్లేశం కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 7 : వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్‌లో దుబాయిలో మృతిచెందిన గుడిసే మల్లేశం కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు గుండా థామస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా థామస్ మాట్లాడుతూ, గత 40 రోజుల క్రితం అక్కడ జరిగిన ప్రమాదంలో మల్లేశం మృతిచెందాడని, మల్లేశం కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, ప్రభుత్వం నుంచి వచ్చే పరిహారం త్వరగా అందజేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట మ్యాకల జీవన్, మ్యాకల సంతోష్, వరప్రసాద్ ఉన్నారు.

ఘనంగా నేషనల్ గర్ల్ చైల్డ్ డే

నేషనల్ గర్ల్స్ చైల్డ్ డేలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 7 : వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లి రోడ్డులోని తెలంగాణ సాంఘిక గురుకుల డిగ్రీ కళాశాలలో నేషనల్ గర్ల్ చైల్డ్ డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ లావణ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, జనవరి 24న మొదలై మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవంతో ముగుస్తాయన్నారు. అనంతరం కార్యక్రమ ముఖ్య ఉద్దేశంపై విద్యార్థులకు ఆర్ట్, పోస్టర్ ప్రదర్శన, చరిత్రలో మహిళా నాయకులపై దృష్టి సారించే నాటక పోటీలు అద్భుతంగా ప్రదర్శించారు. వైస్ ప్రిన్సిపాల్ సుమలత, అకాడమిక్ కోఆర్డినేటర్ సీహెచ్ నిర్మల, స్టాఫ్ సెక్రటరీ రజిని, కల్చరల్ కమిటీ కోఆర్డినేటర్ సంధ్యారాణి, కమిటీ మెంబర్స్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి అన్యాక్రాంతంపై విచారణకు హైకోర్టు ఆదేశం

రుద్రంగి, ఫిబ్రవరి 7: మండల కేంద్రంలోని గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 428/2, 428/3, 428/4 మూడు సర్వే నంబర్‌లో కలుపుకొని మొత్తం విస్తీర్ణం ఎకరా ముప్పై రెండు (1-32) గుంటల భూమి అన్యాక్రాంతమైందని గ్రామానికి చెందిన పిట్టల నరేశ్ ప్రజాప్రయోజన వాజ్యం (పిల్) దాఖలు చేశారు. గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 428/2, 428/3, 428/4 మూడు సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమిలో మండల పంచాయతీ ఆఫీసర్, రుద్రంగి పంచాయతీ కార్యదర్శులు ప్రైవేట్ వ్యక్తుల ఇంటికి పర్మిషన్లు జారీ చేస్తూ డబ్బులు దండుకుంటూ ప్రభు త్వ భూమి అన్యాక్రాంతం చేశారని, గ్రామానికి చెందిన పిట్టల నరేశ్ ప్రజాప్రయోజన వాజ్యం(పిల్) దాఖలు చేయగా, ఈ పిల్‌ను హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి బెంచ్ వద్ద శుక్రవారం విచారణ జరుగగా, విచారణలో భాగంగా న్యాయవాది తీగల రామ్‌ప్రసాద్ గౌడ్ తన వాదనను హైకోర్టు జడ్జికి వినిపించడం జరిగిందని, న్యాయవాది తీగల రామ్‌ప్రసాద్ గౌడ్ వాదనలతో ఏకీభవించిన హైకోర్టు జడ్జి రాజన్న సిరిసిల్ల జిల్లా డీపీవోను అట్టి భూమికి సంబంధించి సమ గ్ర విచారణ చేపట్టి 15 రోజుల్లో రిపోర్టు ఫైల్ చే యాల్సిందిగా ఆదేశించడం జరిగిందని, ఫిర్యాదు దారు పిట్టల నరేశ్ తెలిపారు.

క్రీడాకారులకు సన్మానం

అంతర్జాతీయంగా ఆడేందుకు ఆర్థిక సాయం అందించాలని వినతి

విద్యార్థులను సన్మానిస్తున్న బీసీ సాధికారిత సంఘం నాయకులు

వేములవాడ,ఫిబ్రవరి 7: క్రికెట్లో ప్రతిభ చూపిన అంతర్జాతీయంగా శ్రీలంకలో నిర్వహించే పోటీలకు ఎంపికైన విద్యార్థులను బీసీ సాధికారిత సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులను సంఘం గౌరవాధ్యక్షుడు కొండ దేవయ్య, జిల్లా అధ్యక్షుడు పొలాస నరేందర్ సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మండలంలోని మల్యాల గ్రామానికి చెందిన నేరెళ్ల శివ సుధన్వి, నాంపల్లికి చెందిన వాణిక చైతన్యలు ఇటీవల హిమాచల్ ప్రదేశ్‌లో జరిగిన క్రికెట్ టోర్నమెంట్లో పాల్గొని ప్రతిభ చూపారన్నారు. ఇరువురు కూడా శ్రీలంకలో ఈ నెల 28వ తేదీన జరిగే క్రికెట్ టోర్నమెంట్ ఎంపిక కాగా, అక్కడికి వెళ్లి ఆటలో పాల్గొనేందుకు కావాల్సిన ఆర్థిక సాయాన్ని అందించాలని ప్రభుత్వాన్ని కోరా రు. ఇంటర్ నేషనల్ స్థాయిలో, శ్రీలంకలో జరిగే క్రికెట్ టోర్నమెంట్లో పాల్గొని క్రికెట్ మ్యాచ్ ఆడుటకు గాను అయ్యే విమాన ప్రయాణం, వసతి సౌకర్యం మరియు భోజన సౌకర్యం తదితర ఖర్చులను స్పోర్ట్స్ అథారిటీ వారు రాష్ట్ర ప్రభుత్వం వా రు భరించాలని కొండ దేవయ్య, పొలాస నరేందర్ ప్రభుత్వాన్ని కోరారు. ఇంటర్ నేషనల్ స్థాయిలో క్రికెట్ టోర్నమెంట్లో పాల్గొనేలా క్రీడాకారులను తయారు చేసిన వాగ్దేవి పీటీ దొబ్బ మహేశ్, స్కూల్ కరస్పాండెంట్ గుండెల్లి పర్శరాములు, రామకృష్ణ, శ్రీనివాసాచారి, శ్రీనివాస్ నాయక్‌ను కొండా దేవయ్య, పొలాస నరేందర్ అభినందించారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 7 : మండలంలోని ముస్కానిపేట గ్రామంలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామానికి చెందిన గంట ఎల్లయ్య(32) ను శుక్రవారం మట్టుకున్నామని ఎస్ఐ కదిరె శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. 8 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకుని సీజ్ చేసి కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. అక్రమంగా రేషన్ బియ్యం తరించినా చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

బాధిత కుటుంబానికి ఆగయ్య పరామర్శ

వీర్నపల్లి, ఫిబ్రవరి 7 : ఇటీవల కూలీపనికి వెళ్లి మండలంలోని రంగంపేటకు చెందిన గడ్డం శ్రీనివాస్ (38) గుండెపోటుతో మృతి చెందాడు. కాగా, బాధిత కుటుంబ సభ్యులను ముదిరాజ్ సంఘ సంఘం జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము శుక్రవారం పరామర్శించి, ఓదార్చారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఘటనకు గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ నందగిరి లింగం, సంఘ సభ్యులు దండు శ్రీనివాస్, శ్రీనివాస్, సతీష్ తదితరులు ఉన్నారు.

చర్యలు తీసుకోవాలి

వీర్నపల్లి, ఫిబ్రవరి7: ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడుతున్న మెట్‌పై చర్యలు తీసుకోవాలని బావుసింగ్ నాయక్‌తండా గ్రామస్తులు ఏపీవోకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. కొన్నేళ్లుగా మెట్‌గా పనిచేస్తున్న బానోత్ లింబాద్రి కూలీలు పనికి రాకున్నా, పనిచేసినట్లు రికార్డులో నమోదు చేసి, డబ్బులు పొందుతున్నారని ఆరోపించారు. అవకతవకలకు పాల్పడినమెట్‌పై విచారించాలని కోరారు.

చలో హైదరాబాద్ విజయవంతం చేయాలి

వేములవాడ, ఫిబ్రవరి 7 : ప్రజా సంఘాల పోరాట వేదిక చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రామంచా అశోక్, కార్యదర్శి ముక్తికాంత అశోకులు పిలుపునిచ్చారు. శుక్రవారం వేములవాడ పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా, రైతు ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల బడ్జెట్ అని విమర్శించారు. ఫిబ్రవరి10న ప్రజాసంఘాల పోరాటవేదిక ఆధ్వర్యంలో చేపట్టిన చలో హైదరాబాద్ ఇందిరా పార్క్ మహాధర్నా కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలోని రైతులు కార్మిక వర్గం , వ్యవసాయ కూలీలు, విద్యార్థులు, యువకులు, మహిళలు, సామాజిక సంఘాల ప్రజలందరూ పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మాట్లాడుతున్న జిల్లా ఉద్యమకారుడు రంజిత్

మాకు ప్రాణహానీ ఉంది

- మీరే కాపాడండి
- సిరిసిల్ల జిల్లా ఉద్యమకారుడు రంజిత్

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 7: మృత్యుంజయం నుంచి ప్రాణహాని ఉందని.. సీఎం రేవంత్‌రెడ్డితోపాటు కలెక్టర్, ఎస్పీ స్పందించి తమను కాపాడాలని సిరిసిల్ల జిల్లా ఉద్యమకారుడు మారవేణి రంజిత్ కోరారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో పలువురు బాధితులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని, సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి అనేక మందిని మృత్యుంజయం మోసం చేశాడని ఆరోపించారు. భూములను సైతం కబ్జా చేశాడని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి, కలెక్టర్, ఎస్పీ స్పందించి జ్యుడిషియల్ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మృత్యుంజయంతో చాలా మంది బాధితులకు ప్రాణహానీ ఉందని.. ఎవరికి ఏమైనా జరిగితే పూర్తి బాధ్యత ఆయనదేనన్నారు. బాధితులందరికీ న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. ఇక్కడ బాధితులు శంకర్, అమృత, దేవలక్ష్మి, సంతోష్, ఆంజనేయులు, రాజు, తదితరులు ఉన్నారు.

కోళ్ల మరణాలపై వచ్చే వదంతులను నమ్మద్దు

- జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్‌రెడ్డి
- పౌల్ట్రీ రైతులకు అవగాహన

మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్‌రెడ్డి

కలెక్టరేట్, ఫిబ్రవరి 7: జిల్లాలో బ్రాయిలర్ కోళ్లు వ్యాధి బారిన పడి మరణించడంలేదని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్‌రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు.. శుక్రవారం జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో జిల్లా పౌల్ట్రీ రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ, ఇటీవల ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రల్లో వైరస్ వ్యాధిన పడి కోళ్లు మృతి చెందాయని వార్తలు వచ్చాయని, కాగా, రెండు రోజులుగా జిల్లాలోని పశు వైద్యాధికారులు జిల్లాలోని 97 బ్రాయిలర్, 28 లేయర్ ఫార్మ్‌లను విజిట్ చేసినట్లు తెలిపారు. జిల్లాలో వైరస్ వ్యాధినపడి ఎలాంటి మరణాలు సంభవించలేదని గుర్తించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పౌల్ట్రీ ఫాంలు ఉన్న రైతులకు ఆయన పలు సూచనలు చేశారు. షెడ్లను తరుచూ శానిటైజేషన్ చేయాలని సూచించారు.

నిబంధనలకు అనుగుణంగా దవాఖానలు నిర్వహించాలి

జిల్లా వైద్యాధికారి రజిత

రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి రజిత

ముస్తాబాద్, ఫిబ్రవరి 7: ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఆస్పతులు నిర్వహించాలని జిల్లా వైద్యాధికారి రజిత పేర్కొన్నారు. మండలంలోని ప్రైవేట్ ప్రభుత్వ ఉప కేంద్రాలను శుక్రవారం ఆమె ఆకస్మీంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా ఆరోగ్య ఉపకేంద్రములు ఆవునూరు, నామాపూర్, ముస్తాబాద్, పోతుగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు మండల కేంద్రంలోని తిరుమల ప్రైవేట్ దవాఖానను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిత్యం హాజరు పట్టికతో పాటు ఆపరేషన్స్ మందుల వివరాలను తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డ్స్‌లను, వ్యాక్సినేషన్, వ్యాధిగ్రస్తులకు ఇచ్చే మందుల వివరాలను తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి, ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలు సాధించాలని సూచించారు. మండలంలోని ప్రజలకు అందుబాటులో ఉండి 24 గంటలు ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రైవేట్ దవాఖానలో వైద్యం పేరుతో పరీక్షలు చేసి, డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి అలాంటి దవాఖానలపై చర్యలు తీసు కుంటామని సూచించారు. పేదలకు సేవలందించిన రోజునే ప్రభుత్వ దవాఖానలపై ప్రజలకు విశ్వాసం కలుగుతుందన్నారు.

కనగర్తిలో హెల్త్ క్యాంప్

కోనరావుపేట, ఫిబ్రవరి 7 : మండలంలోని కనగర్తి గ్రామం లో మండల వైద్యాధికారి వేణుమాధవ్ హెల్త్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా తిరుగుతూ ఫీవర్ సర్వే చేసి, శిబిరంలో వైద్య పరీక్షలను చేశారు. అవసరమున్న వారికి మందులను అందజేశారు. వైద్యులు అఖిల్ సిబ్బంది ఉన్నారు.

కనగర్తి గ్రామంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి వేణుమాధవ్

ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన

కొడిమ్యాల, ఫిబ్రవరి 7: ప్రజలు ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన కలిగి ఉండాలని ఎన్‌డీఆర్ఎఫ్ బృందం ఇన్‌స్పెక్టర్ ముఖేష్ కుమార్ సూచించారు. కొండగట్టులో భక్తులకు ప్రకృతి వైపరీత్యాలు, భూకంపం, వరదలు, అగ్ని ప్రమాదాలు, రోడ్డు ప్రమాదాలు జరిగితే ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు సమయానికి రానప్పుడు ప్రాథమికంగా చేయాల్సిన చికిత్స, చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మునీందర్, ఎస్ఐలు నరేశ్, మతిలేష్, ఆలయ సూపరింటెండెంట్ సునీల్, హరినాథ్, ఆర్ఐ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ బృందం సభ్యులు

వివాహితను కాపాడిన పోలీసులు

సారంగాపూర్, ఫిబ్రవరి 7: మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన ఓ వివాహిత శుక్రవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంటున్నట్లు డయల్ 100కు సమాచారం ఇచ్చారు. స్పందించిన హెడ్‌కానిస్టేబల్ అహ్మద్, పీసీ రవిలు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని ఇంటి తలుపులు పగులగొట్టి వివాహితను ఆత్మహత్య చేసుకోకుండా కాపాడారు. ఈ సందర్భంగా పలువురు పోలీసులను అభినందించారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

కోరుట్ల, ఫిబ్రవరి 7: ప్రతి ఒక్కరూ ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి కోరారు. పట్టణంలో శుక్రవారం మున్సిపల్ ఆధ్వర్యంలో డ్రైడే నిర్వహించారు. ఈసందర్భంగా పట్టణంలోని పలు వార్డులను పరిశీలించారు. పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇక్కడ వార్డు అధికారులు, మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది ఉన్నారు.

మాత్రలు అందించాలి

సిబ్బందితో మాట్లాడుతున్న వైద్యాధికారి కార్తీక్

వేములవాడ, ఫిబ్రవరి 7 (బోయినపల్లి) : నులి పురుగు నివారణ మాత్రలు ప్రతి చిన్నారికి అందించాలని మండల వైద్యాధికారి కార్తీక్ పేర్కొన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆయన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఫిబ్రవరి 10వ తేదీన జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవం కార్యక్రమం ఉన్నందున ఒకటి నుంచి 19 ఏండ్లలోపు ప్రతి చిన్నారికి మాత్ర అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏదైనా తప్పిపోతే చిన్నారులకు 17వ తేదీన మళ్లీ అందించే కార్యక్రమం కూడా ఉంటుందని చెప్పారు. ఈ సమావేశంలో ఎంఈవో శ్రవణ్, హెల్త్ సూపర్వైజర్స్ శశికుమార్, హేమలత ఐసీడీఎస్ సూపర్వైజర్ నిర్మల, ఏఎన్ఎంలు ఉన్నారు.

నులిపురుగులపై అవగాహన

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 7: మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంపై మండల వైద్యాధికారి సారియా అంజుమ్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బందికి శుక్రవారం అవగాహన కల్పించారు. 1 నుంచి 19 ఏండ్ల వయసున్న వారు ఆల్బెండజోల్ గోలీలను వేసుకునేలా చూడాలని తెలిపారు. ఇక్కడ పీఎచ్‌సీ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్‌లు ఉన్నారు.

జిల్లా మహాసభ విజయవంతం చేయాలి

జిల్లా మహాసభ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

వేములవాడ, ఫిబ్రవరి7 (బోయినపల్లి) : భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా మహాసభ ఈ నెల 21న వేములవాడలో నిర్వహిస్తున్నందున పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 44 కార్మిక చట్టాలను రద్దు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో వేతన చట్టం కూడా రద్దుచేసి, కార్మికులను రోడ్డున పడేయాలని చూస్తోందని ఆరోపించారు. కార్పొరేట్ రంగాలకు మాత్రమే దోచిపెడుతున్న కేంద్రం కార్మికులను మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. కార్మికులకు రావాల్సిన బకాయిలు, ఇతరత్రా వాటిని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 21న వేములవాల్లో నిర్వహించే భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా మూడో మహాసభలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ భవన నిర్మాణ కార్మిక సంగం నాయకులు రామంచ అశోక్, నల్గొండ రాజు, రవి, సుతారి సంగం నాయకులు రాజలింగం, తహసీల్దార్ కార్మికులు ఉన్నారు.

లింగంపల్లిలో ఇసుక రీచ్ ఏర్పాటు

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 7 : మండలంలోని లింగంపల్లిలో ఇసుకరీచ్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండలంలో జరుగుతున్న పనుల కోసం లింగంపల్లిలో ఇసుకరీచ్‌ను ఏర్పాటు చేసి, అక్కడి నుంచి ఇసుకను తరలిస్తున్నారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శుక్రవారం దాదాపు 30 ట్రాక్టర్‌కు ఇసుక తరలించేందుకు అనుమతులు ఇచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

బీసీ సంఘం అధ్యక్షుడిగా రామాగౌడ్

నియామకపత్రం అందుకుంటున్న రామాగౌడ్

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 7: తంగళ్లపల్లి మండల బీసీ సాధికారిక సంఘం అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన కందుకూరి రామా గౌడ్ నియామకమయ్యారు. ఈ మేరకు శుక్రవారం నియమకపత్రాన్ని బీసీ సాధికారిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొండా దేవయ్య, ఉమ్మడి కరీంనగర్ జిల్లా కన్వీనర్, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు పొలాస నరేందర్ చేతుల మీదుగా రామగౌడ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల ఆత్మగౌరవం ఆశయాలు సిద్ధాంతాలు డిమాండ్ల సాధనకు కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన పెద్దలు కొండా దేవయ్య, పొలాస నరేందర్, గాజుల బాలయ్య, తీగల శేఖర్, మానస రాజు, గజభీంకార్ రాజన్న, అంకారపు రవీందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.